VISION BHARATH REPORTER
విభారే
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారే" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారే
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | గురువారం 02-05-2024 | సంపుటి : 06 | సంచిక : 230 | పేజీలు : 8 | వెల : రూ 3-00

# ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు దుష్ప్రచారం



అనకాపల్లి,మే1 : ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై కూడా చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నాడని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. జగన్ భూములు ఇచ్చేవాడే కానీ.. భూములు తీసుకునే వాడు కాదు. భూములపై సర్వహక్కులు కల్పించడమే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్.. భూములపై సమగ్ర సర్వే చేయించి.. వారికే హక్కులు కల్పిస్తున్నామని సీఎం జగన్ అన్నారు.అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, జగన్ ఎలాంటి వాడో రాష్ట్ర ప్రజలందరికి తెలుసు. అసలు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ గురించి బాబుకు తెలుసా?. మీ భూముల మీద మీకు సర్వహక్కులూ కల్పించడమే ఈ యాక్ట్ ఉద్దేశ్యం. 100 సంవత్సరాల క్రితం బ్రిటిషర్లు ఉన్నప్పుడు సర్వే జరిగింది. ఆ తర్వాత సర్వే జరగలేదు. గ్రామ సచివాలయాల్లో 15 వేల సర్వేయర్లను పెట్టించి ఇలా సర్వే గతంలో ఎవ్వరూ చేయించలేదు. ఆ సర్వే లేక భూములన్నీ సబ్ డివిజన్ జరక్క, భూముల కొలతలు సరిగ్గా లేక అమ్ముకోడానికి కొనుక్కోడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోర్టుల చుట్టూ, రెవెన్యూ అధికారుల చుట్టు తిరుగుతూ, డబ్బులు ఇచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి మార్చాలి అని ప్రతి ఒక్కరి భూమి మీద సంపూర్ణ హక్కు ఇవ్వాలని ప్రతి గ్రామంలో రీ సర్వే చేయించాం' అని సీఎం వివరించారు. వాళ్ల భూముల మీద సర్వ హక్కులూ వాళ్లకి ఇవ్వడానికి బౌండరీస్ నాటించి, రికార్డులన్నీ అప్డేట్ చేసి ఆ పత్రాలన్నీ రిజిస్ట్రేషన్ చేసి మళ్లీ రైతులకు ఇచ్చే కార్యక్రమం జరుగుతోంది. ఇంత గొప్ప కార్యక్రమానికి చేతనైతే మద్దతు పలకాలి కానీ దాని మీద కూడా దుష్ప్రచారాలు జరుగుతున్నాయని సీఎం

**భూములు గుంజుకునే దుష్ట ఆలోచన చంద్రబాబుదే**
**జగన్ ఎలాంటి వాడో రాష్ట్ర ప్రజలకు తెలుసు**
**భూమిమీద హక్కుల కోసమే రీ సర్వే చేయించా**
**చంద్రబాబుకు ఓటేస్తే మోసపోవడం ఖాయం**
**పాయకరావ్పు పేట సభలో సిఎం జగన్**



ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు, బాబు మోసాలకు మధ్య జరిగే యుద్ధం ఇది. మే 13న కురుక్షేత్ర యుద్ధం జరగబోతుంది, విలువలకు, విశ్వసనీయతకు ఓటేయడానికి మీరంతా సిద్ధమేనా?. చంద్రబాబుకు ఓటేస్తే మళ్లీ మోసపోవడమే. ఎన్నికల్లో మీరు వేసే ఓటే పేదల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. 59 నెలల్లో విప్లవాత్మక పాలన చేయడంతో చంద్రబాబుకు మన మీద పిచ్చి కోపం వస్తోంది. మీ జగన్ మంచి చేశాడని చంద్రబాబుకు కోపమొస్తుందని సీఎం జగన్ ధ్వజమెత్తారు. అవ్వాతాతలకు ఇంటివద్దే పెన్షన్ ఇవ్వడం విప్లవం అవునా?కాదా?. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం విప్లవాత్మక మార్పు. ఉన్నత చదువుల కోసం విద్యాదీవెన, వసతి దీవెన.. పిల్లలను బడులకు పంపే తల్లులకు అమ్మఒడి పథకం.. అక్కా చెలలెమ్మల కోసం ఆసరా, చేయూత, సున్నావడ్డీ.. 31 లక్షల ఇళ్ల పట్టాలు అక్కా



చె÷–లలెమ్మల పేరుపై రిజిస్ట్రేషన్.. మహిళల రక్షణ కోసం దిశా యాప్ తీసుకొచ్చాం' అని సీఎం జగన్ పేర్కొన్నారు. రైతన్నకు తోడుగా పెట్టుబడి సాయం విప్లవాత్మక మార్పు. పగటిపూటే 9 గంటల పాటు ఉచిత విద్యుత్ విప్లవాత్మక మార్పు. సకాలంలోనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నాం. ప్రతి గ్రామంలోనూ విలేజ్ క్లినిక్ విప్లవాత్మక మార్పు. ఫ్యామిలీ డాక్టర్ విప్లవాత్మక మార్పు. పేషెంట్ విశ్రాంతి సమయంలో ఆర్థిక సాయం విప్లవాత్మక సాయం. గ్రామ స్వరాజ్యానికి అర్థం చెప్తూ గ్రామ,



వార్డు సచివాలయాలు. వాలంటీర్ వ్యవస్థతో పౌర సేవలందిస్తున్నాం' అని సీఎం చెప్పారు. రూ.2 లక్షల 70 వేల కోట్లు పేదల ఖాతాల్లో వేయడం ఓ విప్లవం. అబద్ధాలు, మోసాలకు చంద్రబాబు రెక్కలు కడుతున్నాడు. చంద్రబాబు పేరు చెప్తే ఒక్క పథకమైనా గుర్తుకొస్తుందా?. పేదల పక్షాన మీ బిడ్డ జగన్ నిలబడ్డాడు. చంద్రబాబు పక్షాన దత్తపుత్రుడు, ఎల్లో మీడియా, కుట్రలు.. చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలతో పెన్షన్‌ను అడ్డుకున్నాడు. 14 ఏళ్లలో బాబు ఏనాడూ అవ్వాతాతలను పట్టించుకోలేదని అంటూ సీఎం జగన్ దుయ్యబట్టారు. మీ ఓటు.. ఐదేళ్ల భవిష్యత్..వంచనతో బాబు.. మంచితో జగన్ ఎన్నికలకు వెళ్తున్నాం. జగన్‌కు ఓటేస్తే.. సంక్షేమ పథకాలు కొనసాగింపు..బాబుకు ఓటేస్తే.. పథకాలు ముగింపే.బాబును నమ్మడమంటే కొండ చిలువ నోట్లో తల పెట్టడమే. చంద్రబాబు వంచన చేస్తే.. మీ జగన్ మంచి చేశాడు' అని సీఎం పేర్కొన్నారు.ఏపీలో వైసీపీహయాంలో విప్లవాత్మక పాలన కొనసాగించామని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. విద్యారంగంలో అనేక మార్పులు తీసుకువచ్చామని, నాడు నేడు విద్యా కానుక, ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం, పిల్లల చేతిలో ట్యాబ్‌లు, తరగతి గదిలో డిజిటల్ బోధన, ఫీజు రియింబర్స్‌మెంట్, 93 శాతం విద్యా దివేన విద్యావసతి కింద సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ఆరోగ్య శ్రీ పరిధిని రూ. 25 లక్షలు పెంచామని తెలిపారు. అమ్మ ఒడి పథకాన్ని గతంలో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మహిళలకు సున్నా వడ్డీ రుణాలు అందించామని తెలిపారు.

# జగన్ పాలన నుంచి విముక్తే నా లక్ష్యం



అంబేద్కర్ కోనసీమ,మే1 : మన అభిమాన హీరో చిరంజీవినే అవమానించిన జగన్ ఇంటికి పంపే సమయం ఆసన్నమైందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. జగన్ దుర్మార్గ పాలన నుంచి ఏపీకి విముక్తి కల్పించాలన్నదే తన బలమైన లక్ష్యమని జనసేన పవన్‌కల్యాణ్ అన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తామని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండపేటలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం చేసే రైతు నష్టాల్లో ఉన్నాడని.. గంజాయి పండించే వైకాపా నేతలు లాభాల్లో ఉన్నారని వ్యాఖ్యానించారు. ద్వారంపూడి కుటుంబం దోచుకోవడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. దశాబ్దం నుంచి తనను చాలా రకాలుగా ఇబ్బందిపెట్టారని.. ప్రజాసంక్షేమం కోసం ఎన్ని ఇబ్బందులైనా ఎదుర్కొంటానని చెప్పారు. పట్టాదారు పాస్‌పుస్తకాలపై ఆంధ్రప్రదేశ్ రాజముద్ర ఉండాలి. ప్రధానిగా మోదీ ఉన్నందున పాస్‌పోర్టుపై ఆయన ఫొటో లేదే అని అన్నారు. వైకాపాకు ఓటు వేస్తే ప్రజల ఆస్తులు గాలిలో దీపమే. మన ఆస్తి పత్రాలపై జగన్ హక్కు

**కూటమి ప్రభుత్వంతో బంగారుబాట వేస్తాం**
**మళ్లీ అధికారంలోకి వస్తే ఉన్న భూములు లాక్కుంటారు**
**మండిపేట ప్రచారంలో జనసేనాని పవన్ కళ్యాణ్**

ఏంటని నిలదీయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గంజాయి గూండాలను ఉక్కు పాదంతో నలిపేస్తాం. వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తాం. వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందిస్తాం. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తాం. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తాం. దళారుల దోపిడీ అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు చేపడతాం. సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. కేంద్రం నుంచి వచ్చే నిధులను పంచాయతీలకే కేటాయిస్తాం. ప్రతిపక్షం కూడా లేకుండా కూటమి పార్టీలను గెలిపించాలని పవన్ కోరారు. బుధవారం మండపేట బహిరంగ సభలో జనసేనాని మాట్లాడుతూ... ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తామని.. రైతాంగానికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు నేరుగా పంచాయతీలకు కేటాయిస్తామన్నారు. పోలీస్, రెవిన్యూ వ్యవస్థలను ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు. జగన్ నాయకత్వంలో ద్వారంపూడి కుటుంబం రాష్ట్ర సంపదను దోచేస్తుందని ఆరోపించారు. 2014లో టీడీపీ, బీజేపీకి జనసేన మద్దతు ఇవ్వటం వల్ల ప్రభుత్వం ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. కులాల్ని దాటి వెళ్ళకపోతే రాష్ట్రం నాశనం అయిపోతుందన్నారు. తోట త్రిమూర్తులు, పిల్లి బోస్‌లు రాజకీయ శత్రువులని.. ఇప్పుడు రాజకీయ అవసరాలు కోసం కలిసిపోయారన్నారు. తోట త్రిమూర్తులు జనసేనలోకి రావటం లేదని స్పష్టం చేశారు. ద్రాక్షారామలో కాపు కళ్యాణమండపం నిర్మాణం చేపడతామని చెప్పి.. స్థలం కాజేసి రెండేళ్లుగా కళ్యాణమండపం నిర్మించలేదన్నారు.

# మోసాలు చేయడమే చంద్రబాబు నైజం



విజయనగరం,మే1 కుర్చీలు లాక్కోవడం, వెన్నుపోటు పొడవడం, మోసం చేయడం, మనషుల్ని చంపేయడం.. ఇదే చంద్రబాబు రాజకీయమని, అలాంటి చంద్రబాబుకి ఓటేయమని అడిగే అర్హత ఎక్కడ ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా.. బుధవారం ఉదయం బొబ్బిలి మెయిన్ రోడ్ సెంటర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని సీఎం జగన్ ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో జగన్‌కు ఓటేస్తే పథకాల కొనసాగింపు. అదే పొరపాటున చంద్రబాబుకు ఓటేస్తే పథకాల ముగింపు. మళ్లీ మోసపోవడం ఖాయం. ఈ ఎన్నికలు ఎమ్మెల్యే, ఎంపీలను ఎన్నుకు నేందుకు వేసే

**బాబుకు ఓటేస్తే పథకాలకు మంగళం పాడినట్లే**
**ఈ ఓటు మీ తలరాతు మార్చేదని సూచన**
**బొబ్బిలిలో బెల్లానకు మద్దతుగా జగన్ రోడ్ షో**

ఓటు కాదు.. ఈ ఓటుతో మీ తలరాతలు మారుతాయి. రాబోయే ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయించేవే ఈ ఎన్నికలు. పథకాల కొనసాగింపును నిర్ణయించేవి ఈ ఎన్నికలు.. చంద్రబాబు మాటలు ఆయన దిగజారుడుతనాన్ని తెలియజేస్తున్నాయి. అయ్యా చంద్రబాబూ.. ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్సార్, ఆ మహానేతకు వచ్చిన ప్రజాదరణను ఓర్వలేక అసెంబ్లీ సాక్షిగా 'నువ్వు ఆ గాలిలోనే కలిసిపోతావ్' అని అన్నమాటల్నినేను మరిచిపోలేను. నాడు నా తండ్రిని, నేడు నన్నూ.. ఈ ప్రజా క్షేత్రంలో ఎదుర్కొనలేక నువ్వు మాట్లాడే మాటలు.. నీ నేర ప్రవృత్తికి అద్దం పడుతున్నాయి. బాబు మెంటల్ హెల్త్ ఏ స్థాయిలో ఉందో ప్రజలంతా అర్థం చేసుకోవాలి. కానీ, చంద్రబాబు అనుకుంటే జగన్ చనిపోడు.. జగన్‌ను ప్రజలే రక్షించుకుంటారు. అవ్వాతాలు, అక్కాచెల్లెమ్మల ప్రార్థనలు, దీవెనలే నాకు శ్రీరామరక్ష.వలంటీర్ల ద్వారా మళ్లీ సంక్షేమం కొనసాగాలన్నా, వైద్యం ఆరోగ్య సేవలు.. రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలన్నా.. ఫ్యాన్ గుర్తును రెండుసార్లు నొక్కాలి. 175కి 175 ఎమ్మెల్యే స్థానాలు, 25 ఎంపీ స్థానాలు వైఎస్సార్‌సీపీకే రావాలి. దేశంలో ఎన్నడూ జరగని విధంగా, రాష్ట్రంలో మునుపెన్నడూ చూడని రీతిలో 175 ఎమ్మెల్యే, 25 ఎంపీ స్థానాలు.. మొత్తం రెండొందల స్థానాలకు ఏకంగా 100 స్థానాలు.. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలు పోటీకి దిగుతున్నారు. సామాజిక న్యాయం ఏ స్థాయికి వెళ్లిందో అర్థం చేసుకోండి. వైఎస్సార్‌సీపీ తరఫున బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎస్. వెంకట చిన అప్పలనాయుడు పోటీ చేస్తున్నారు. ఆయన్ని గెలిపించి సామాజిక న్యాయాన్ని గెలిపించాలి. విజయనగరం ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌లను గెలిపించాలని ఈ సందర్భంగా సీఎం జగన్ ప్రజలకు పిలుపు ఇచ్చారు.

## అమలుచేయదగ్గ హామీలతో మేనిఫెస్టో

**అనుమానాలుంటే నివృత్తి చేస్తాం**
**ఖర్చులు తగ్గించుకుంటే 3వేల కోట్లు ఆదా**
**మాజీ ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు**

అమరావతి,మే1 : పూర్తిగా అమలు చేయదగ్గ మేనిఫెస్టోనే తాము రూపొందించామని మాజీ ఆర్థికమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. తమ మేనిఫెస్టో అమలుపై ఎవరికైనా సందేహాలుంటే నివృత్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు ఆదాయాన్ని పెంచుతామన్నారు. అనవసరపు ఖర్చులు తగ్గిచడం ద్వారా సుమారు రూ. 2–3 వేల కోట్లను ఆదా చేయవచ్చని చెప్పుకొచ్చారు. పన్నులు వేయకుండా.. వ్యవస్థలను స్ట్రీమ్ లైన్ చేయడం ద్వారా ఆదాయం పెంచుతామన్నారు. నాన్ ట్యాక్స్, ఓన్ ట్యాక్స్ రెవెన్యూలు తాము ఎన్డీఏలో భాగస్వాములుగా ఉన్నాం కాబట్టి.. గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు ఎక్కువగా వచ్చేలా ప్లాన్ చేసుకుంటామని తెలిపారు. డివల్యూషన్ ఫండ్స్ షేర్ను 50 శాతం చేయాలనే డిమాండ్ పెట్టి కేంద్రాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తామన్నారు.

# ఎంపిగా గెలిపిస్తే మంత్రిగా సేవలందిస్తా



కడప,మే1( : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వేళ ప్రధాన పార్టీల అధినేతలు క్షణం తీరిక లేకుండా ఉన్నారు. ఏపీ సీఎం వైఎస్ జగన్ లక్ష్యంగా ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనను కడప ఎంపీగా గెలిపిస్తే కేంద్రంలో మంత్రిని అవుతానని షర్మిల ధీమా వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా సాధిస్తానని స్పష్టం చేశారు. బద్వేలు

**ప్రత్యేక హోదా సాధించి తీరుతా**
**కడప జిల్లా ప్రచారంలో వైఎస్ షర్మిల**

నియోజకవర్గం పోరుమామిళ్ల మండలంలో జరిగిన బహిరంగ సభలో షర్మిల మాట్లాడారు. వైఎస్‌ఆర్‌కు జగన్ వారసుడు ఎలా అవుతాడని షర్మిల ప్రశ్నించారు. వైఎస్‌ఆర్ ఆశయాలను ఒక్కటి అమలు చేశాడా? అని అడిగారు. అధికారంలో ఉండి రైతులను అప్పుల పాలు చేశాడని విరుచుకుపడ్డారు. 'వైఎస్‌ఆర్ హయాంలో వ్యవసాయం పండగ. నేడు రాష్ట్రంలో అప్పు లేని రైతు లేడు. పంట నష్ట పరిహారం అని మోసం చేశాడు. ధరల స్థిరీకరణ నిధి అని ఛీట్ చేశాడు. నిరుద్యోగ బిడ్డలను వంచనకు గురిచేశాడు. 2.35 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తా అని చెప్పి, అధికారం అనుభవించి ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదు. ఇవ్వాల్టికి రాష్ట్రంలో 2.25 లక్షల ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయి. నేను వైఎస్‌ఆర్ బిడ్డ.. పులి బిడ్డ. నా గుండెలో దమ్ముంది. న్యాయం కోసం ఎంపీగా పోటీ చేస్తున్నా. మళ్ళీ నిందితుడికి ఎంపీ సీట్ ఇవ్వడం అన్యాయం. మీరు న్యాయం వైపు ఉంటారా ? అన్యాయం వైపు ఉంటారో కడప గడ్డ ప్రజలు ఆలోచన చేయాలి. నేను పుట్టింది ఇక్కడే...ఇది నా గడ్డ. ఇక్కడే ఉంట.. ప్రజా సేవ చేస్తా అని' వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. కడప ఎంపీగా అనాడు వైఎస్‌ఆర్ పని చేశాడు. వైఎస్ వివేకా కూడా ఎంపీ గా గెలిచారు. ఇప్పుడు వైఎస్ ఆర్ బిడ్డ కడప ఎంపీగా పోటీకి దిగింది.

# సంపాదకీయం

గురువారం 02-05-2024

## కరెంట్ , సాగునీటి పైనే బిఆర్ఎస్ ఆశలు !

లోక్‌సభ ఎన్నికల్లోనూ కెసిఆర్ పాపులర్ పథకాలు మరోమారు ప్రచారాంశం అవుతున్నాయి. రాజకీయ విమర్శలతో పాటు పథకాల పనితీరు ముందుకు వస్తున్నాయి. ఇందులో నిరంతర విద్యుత్, రైతుబంధు, కాళేశ్వరం నీల్లు అంటూ కెసిఆర్ తన ప్రచారంలో ప్రదానంగా ప్రస్తావిస్తున్నారు. ఇవే ఓట్లు సాధిస్తాయని, కాంగ్రెస్, బిజెపిలను దెబ్బతీస్తాయన్న ధీమాలో కెసిఆర్ ఉన్నారు. అందుకే ప్రధానంగా 24 గంటలు కరంట్ అందించిన తీరును ఆయన బాగా ముందుకు తెస్తున్నారు. తాను అధికారంలో ఉండగా ఇచ్చిన కరెంట్‌ను ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేకపోతున్నదని కెసిఆర్‌తో పాటు బిఆర్ఎస్ శ్రేణులు బాగా ప్రచారం చేస్తున్నారు. కరెంట్, రైతుబంధు, ధాన్యం కొనుగోళ్లతో రైతులను ఆకట్టుకునేలా ప్రచారం సాగిస్తున్నారు. గతంలో ఎండాకాలంలో ఊరూరా కరెంట్ ఇచ్చిన విషయాన్ని బాగా ఫోకస్ చేస్తురు. ఇప్పటికే ట్రాన్స్‌కో కూడా ఎక్కడా లోటుపాట్లు లేకుండా విద్యుత్ సరఫరాలో ముందున్నది. ప్రధానంగా ఈ నాలుగు మాసాల్లో కాంగ్రెస్ కూడా విద్యుత్ సమస్యను అధిగమించి పనిచేస్తోంది. గతంలో ఇచ్చిన మాదిరిగానే సరఫరా చేస్తున్నారు. అయితే దానిని కాదని కెసిఆర్ కరెంట్ కోతలు అంటూ ఈ మధ్య ట్వీట్లు చేస్తున్నారు. ఎందుకంటే కరెంట్ వెతలతో నానా కష్టాలు పడ్డ సామాన్యులకు, రైతులకు, పారిశ్రామికవేత్తలకు నిరంతర విద్యుత్ అలవాటయ్యింది. కరెంట్ లేదు..రాదు అన్న ఆలోచన లేకుండా చేసిన ఘనత కెసిఆర్‌దే. తెలంగాణ ఏర్పడ్డ తరవాత సిఎం కెసిఆర్ కీలక నిర్ణయాలు తీసుకుని నిరంతర విద్యుత్‌కు పెద్దపీట వేశారనే చెప్పాలి. ఇలాంటి నిర్ణయాలతో తెలంగాణ పురోగమనంలో కీలక అడుగులు పడ్డాయి. అందుకే కరెంట్ కోతలు, ధాన్యం కొనుగోళ్లు, సాగు,తాగునీటి సమస్యలను ప్రధానంగా తమ ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు. ఇప్పుడు ఈ విషయాల్లో కాంగ్రెస్‌ను దోషిగా నిలబెట్టాలని చూస్తున్నారు. అలాగే ప్రధానంగా జిల్లాల విభజన, కొత్త జిల్లాల ఏర్పాటు పాలనా వికేంద్రీకరణలో ఇదో మైలురాయిగా కెసిఆర్ చెబుతున్నారు. జిల్లాలను మారుస్తామని సిఎం రేవంత్ గతంలోనే ప్రకటించారు. 10 జిల్లాలు ఉన్న తెలంగాణను పాలనా వికేంద్రీకరణలో భాగంగా 33 జిల్లాలో చేశారు. అయితే అడ్డదిడ్డంగా జిల్లాల ఏర్పాటు జరిగిందని అసెంబ్లీ సాక్షిగా సాఇఎం రేవంత్ ప్రస్తావించారు. అందుకే కాంగ్రెస్‌పై ఎదురుదాడికి అవసరమైన ఎజెండాను ఎత్తుకున్నారు. ప్రధానంగా కెసిఆర్ ఇప్పుడు రైతుల ఎజెండాను భుజానకి ఎత్తుకున్నారు. రైతుబంధుతో పాపులర్ అయిన కెసిఆర్ ఇప్పుడు వారినే నమ్ముకున్నారు. అలాగే వివిధ పథకాల ద్వారా లబ్ది పొందిన వారినే ఓటు బ్యాంక్‌గా గ్రహించారు. ఇందులో భాగంగానే భారతదేశంలోనే గొప్ప రైతులు, ధనవంతులైన రైతులు, ధనవంతులైన యాదవులు ఎక్కడ ఉన్నారంటే.. తెలంగాణ రాష్ట్రంలోనే అని చెప్పుకునేలా చేశానని అంటులన్నారు. దళితులు, గిరిజనుల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. దళితబంధు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీస్తున్నారు. దేశంలోనే అతి ఎక్కువ సమయంలో ఆర్థికప్రగతి సాధించాం.. అతికొద్ది సమయంలోనే ఇవన్నీ సాధించుకున్నాం. మిషన్ భగీరథ..కాళేశ్వరం ప్రాజెక్ట్.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం..ఇవన్నీ కూడా కెసిఆర్ కలల ప్రాజెక్టులు. నీళ్లు,నిధులు నియామకాలు అన్న స్లోగన్‌తో ఉద్యమాన్ని గమ్యం చేరేలా చేసి...అధికారం చేపట్టిన తరవాత ఇలాంటి పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లామని చెబుతున్నారు. ప్రస్తుతం అమలవుతున్న వాటిలో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ముఖ్యమైనవి. వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేక చతికిల పడిందని అన్నారు. ఇక రెండు పడకగదుల ఇళ్లు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందిలో కొత్త ఆశలు చిగురింపజేశాయి. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నట్లుగా నాటి ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఎక్కడా లబ్దిదారులకు అవి అందలేదు. సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ఇలా చెప్పుకుంటూ పోతే తెలంగాణలో గతంలో మునుపెన్నడూ జరగని పనులు జరిగాయని ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ స్వచ్ఛమైన మంచినీటిని అందజేసే మిషన్ భగీరథ, చెరువులను పునరుద్ధరించి వాటిలో పుష్కలంగా నీళు ఉండేటట్టు చూసే మిషన్ కాకతీయ, రెండు పడక గదుల ఇళ్లు, 36లక్షల మందికి ఆసరా పథకం కింద పెన్షన్లు అందజేత వంటి వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థంగా చేపట్టిందని మాజీమంత్రిలు కూడా అంటున్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లాంటివి పేదలకు వరంగా నిలిచాయని, తులం బంగారం జోడించి ఇస్తామన్నా ఇవ్వడం లేదన్నారు. అన్నింటికి మించి హరితహారం కార్యక్రమం తెలంగాణకు పెద్ద అసెట్ అయ్యిందని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. మొక్కల పెంపకం పెద్ద ఉద్యమంగా సాగింది. నిరంతర విద్యుత్,నీటి సరఫరా, ఎరువులు విత్తనాలు అందచేత, పెట్టుబడి సాయం కింద ఎకరాకు 8వేలు అందచేసే కార్యక్రమం, రైతులకు బీమా పథకం..ఇవన్నీ కూడా అద్భుతాలు గానే చూడాలన్నారు. కెజి టూ పిజిలో భాగంగా గురుకులాల ఏర్పాటు కూడా ఓ విప్లవాత్మకమైన మలుపుగా చెప్పుకోవాలి. పేదలకు ఉచిత విద్యను అందించే క్రమంలో ఇదో అపురూపమైన ఘట్టంగా చెప్పుకోవాలి. చేపట్టిన పనిని చివరి వరకు వదలకుండా చేసే మొండి ధైర్యం కెసిఆర్‌దని నిరూపించారని అన్నారు. తను చేపట్టిన పని విజయవంతంగా పూర్తి చేయడమే తప్ప వెనుదిరిగి చూడని ధృడచిత్తం కెసిఆర్‌కే సొందం. ఈ ఎంపి ఎన్నికల్లో కనీసం 12సీట్లు గెలవాలి ఢిల్లీలో పాగా వేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు.

## మాయమవుతున్న గుండ్లపోచంపల్లి రాతిచిత్రాలు

మెదక్, మే 1 మెదక్ జిల్లాలోని గుండ్లపోచంపల్లి సమీపంలో రాతి చిత్రాలను గుర్తించారు. రియల్ ఎస్టేట్ విస్తరణతో ఈ తరహా రాతిచిత్రాలు కనుమరుగయ్యే అవకాశం ఉందని చరిత్రకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.హైదరాబాద్ కు 25 కి.మీ.ల దూరంలో కొంపెల్లి గ్రామానికి చేరువలోవున్న గుండ్లపోచంపల్లికి 2 కి.మీ.దూరంలో ప్రభుత్వ అటవీ భూముల అంచున 3శిలాశ్రయాలలో కొత్తగా రాతిచిత్రాలు కనుగొనబడ్డాయి. ఈ చిత్రిత శిలాశ్రయాలు భౌగోళికంగా 17.5820 డిగ్రీల అక్షాంశాలు,78.4617 డిగ్రీల రేఖాంశాలపై, సముద్రమట్టానికి 545మీ.ల ఎత్తున వున్నాయి.గుండ్లపోచంపల్లికి చెందిన సాయికృష్ణ, దక్కన్ యూనివర్సిటి చారిత్రక పరిశోధక విద్యార్థి, యువ ఇంజనీర్ (ప్రస్తుతం ఏఎస్పైలో ఉద్యోగి, డాక్టరేటు సాధించాడు.) చరిత్రపై ఆసక్తితో తన అన్వేషణను తన ఊరి నుంచే మొదలుపెట్టి సఫలీకృతంగా ఈ మూడు చిత్రితశిలాశ్రయాలను కనుగొన్నాడు. కొత్త తెలంగాణ చరిత్ర బృందాన్ని తమ గ్రామానికి ఆహ్వానించి మాకు వాటిని చూపించాడు. ఈ చారిత్రక యాత్రలో చరిత్ర బృందం యొక్క సభ్యులు శ్రీరామోజు హరగోపాల్, వేముగంటి మురళీకృష్ణ, బెల్లంకొండ సంపత్ కుమార్, ఫారెస్ట్ గార్డ్, సాయికృష్ణ తోడుగా రాతి చిత్రాలు పరిశీలించారు.మొదటిలో మధ్యశిలాయుగం, నవీన శిలాయుగం సంధికాలానికి చెందిన రాతి చిత్రాలున్నాయి. చాలా అందంగా చిత్రించిన ఎరుపురంగు అడవిదున్నల చిత్రాలు ఆధునిక చిత్రకారుల పెయింటింగ్సునే సవాలు చేసేంత గొప్పగా కళాత్మకంగా వున్నాయి. రెండడుగుల ఎత్తు, మూడడుగుల పొడవున్న ఈ చిత్రాలు తెలంగాణ పూర్వయుగ చరిత్రకు కొత్తపేజీలు. ఇక్కడే కొన్ని రాతిపనిముట్లు లభించాయి. వాటిలో బూమరాంగు వంటి వంపుగల రాతిపనిముట్టు, పెచ్చురాళ్ళతో ఒకవైపు చెక్కిన గొడ్డళ్ళు, బొరిగెలవంటివి, రాతికత్తులు, మరొక నునుపైన రెండువైపులచెక్కిన రాతిగొడ్డలిముక్క (నవీనశిలా యుగానికి చెందినది)ఉన్నాయి.రెండవ శిలారాయి చాలా ముఖ్యమైనది. ఎక్కువ చిత్రాలు వేర్వేరుకాలాల్లో ఒకదానిపై మరొకసారి గీసిన రాతి చిత్రాలు చాలా వున్నాయి. ఒకచోట అందమైన మొదటి శిలాశ్రయంలోని అడవిదున్నలతో పోలికలున్నచిత్రణతో మూపురమున్న ద్విశూలం వంటి వంపు కొమ్ములతో ఒక ఎద్దు ఉంది. ఇక దాని పక్కన గొప్ప చిత్రకారుని చేతిలో రూపుదిద్దుకున్న చిత్రం వంటి రెండెద్దులబొమ్మ, ఒక ఎద్దు వెనక మరొక ఎద్దు వాటి కొమ్ములు మధ్యలో అగుపిస్తుంటాయి. అదొక జమిలి ఎద్దుల బొమ్మ లెక్క కనిపిస్తుంది. వీటికి దగ్గరలో ఒక దుప్పిబొమ్మ చిత్రించిన తీరు మనోహరంగా ఉంది.ఈ పెద్ద చిత్రాల కాన్వాసులో మరొకచోట సన్నని గీతల ఏనుగు బొమ్మవుండడం విశేషం. మెదక్ జిల్లా అస్తలాపూర్ తర్వాత ఏనుగు కనిపించడం ఇక్కడే. చిత్రాల అంచులతో అంతటా ఈటెలు,తాళ్ళవలలు ధరించిన వేటగాళ్ళబృందాలు కని పిస్తున్నాయి. అవి కొంచెం ఎక్కువగా అయి వున్నాయి. ఇంకొక చోట సామూహికనృత్యం చేస్తున్న ముగ్గురు ఆదిమానవుల దృశ్యం గొప్పచిత్రం. వాళ్ళ పక్కన పడివున్న జంతుదేహాలు కనిపిస్తున్నాయి.ఈ శిలాశ్రయం వద్ద పరిశోధన జరిపితే ఆదిమానవుల పనిముట్లు దొరికే అవకాశముంది. మొదటి శిలాశ్రయం 10 అడుగుల ఎత్తు లోపలే వుంది. ఈ రెండో శిలాశ్రయం 20 అడుగుల ఎత్తులో వుంది. మూడో శిలాశ్రయంలో రాతిచిత్రాలన్నీ మాసిపోయివున్నాయి. పెద్దవి, పొడవైన కొమ్ములున్న మగజింక(ఇర్రి)వంటి జంతువు చిత్రించబడి వుంది. మరికొన్ని జింకలవంటి అస్పష్టచిత్రాలు అక్కడ అగుపిస్తున్నాయి. ఈ శిలాశ్రయం 30 అడుగుల ఎత్తులో వుంది.ఈ చిత్రిత శిలాశ్రయాలు మూడుయుగాల ప్రతినిధులు. మూడో శిలాశ్రయం ప్రాచీనశిలాయుగానికి, మధ్యశిలాయుగానికి కూడా చెందినది. ఇక్కడి బొద్దుగీతల బొమ్మలు చాలా రఫ్ గా వున్నాయి. అంత ఎత్తున ఆదిమానవుల నివాసమున్నది మధ్యశిలాయుగాలకు ముందుననే. దట్టమైన అడవిలో క్రూర జంతువులనుండి రక్షణకై ఇంత ఎత్తులలో వుండడం సహజంగా మధ్యశిలాయుగంనాటి లక్షణం. రెండవ శిలాశ్రయంలోని బొమ్మలు రెండుతరాలకు చెందినవిగా అగుపిస్తున్నాయి. సన్నని గీతలబొమ్మలు, వీటిలో ఆడవాళ్ళ బొమ్మలు లేవు. వేట దృశ్యాలు వీటి ప్రత్యేకత. చాల్కోలిథిక్ పీరియడ్లో వేసిన బొమ్మల వలె జననేంద్రియాల చిత్రణ లేదు వీటిలోవేసిన బొమ్మల మీదనే బొమ్మలు వేసివున్నాయంటే తర,తరాలుగా ఆదివాసుల ఆవాసంగా ఈ ప్రదేశముండివుంటుంది. రెండోతరం బొమ్మలన్నీ, కళాత్మకత వుట్టిపడుతున్నాయి. రెండెద్దుల బొమ్మలోని చిత్రకళానైపుణ్యం ఆదిమానవుల ఈస్థటిక్సుని తెలియచేస్తున్నది. మొదటి శిలాశ్రయం రాతిపనిముట్లవల్ల మధ్యశిలాయుగానిదని, రాతిచిత్రాల వల్ల నవీనశిలాయుగానిదని తెలుస్తున్నది. ఒకేచోట ఆదిమానవుల సాంస్కృతిక వైభవాన్ని చూడగలగడం ఒక అద్భుతం, అపూర్వం.రోజురోజుకూ రియల్ ఎస్టేట్ విస్తరణ సాగుతుండటంతో ఈ తరహా రాత్రి చిత్రాలు కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వీటి రక్షణ కోసం కేంద్రమంత్రి నుంచి స్థానిక రెవెన్యూ అధికారుల వరకు విజ్ఞప్తులు చేసినా ఫలితం మాత్రం శూన్యంగా ఉందని వాపోయారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోదీ సర్కార్ : బృందా కారత్




మేడే సందర్భంగా మోదీ సర్కార్‌పై సీపీఎం నేత బృందా కారత్ బుధవారం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని బీజేపీ పాలకుల దమనకాండపై ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఆమె అభ్యర్థించారు.మోదీ ప్రభుత్వం కార్మికుల పొట్టకొడుతూ వారి హక్కులను కాలరాస్తోందని దుయ్యబట్టారు. కార్మికులకు మేలు చేయని కాషాయ ప్రభుత్వం పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతోందని అన్నారు. పదేండ్ల తన పాలన కేవలం ట్రైలర్ మాత్రమేనని పూర్తి సినిమా ముందుందని ప్రధాని మోదీ చెబుతున్నారని అన్నారు.తమ హక్కులను పూర్తిగా కాలరాసిన పాలన ట్రైలర్ అయితే ఇక రాబోయే రోజుల్లో ఏం జరగుతుందో తలుచుకుంటేనే భయం వేస్తోందని వ్యవసాయ కార్మికులు చెబుతు

## ఆదిలాబాద్ జిల్లాలో రచ్చకెక్కిన కాంగ్రెస్ రాజకీయాలు



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ రాజకీయాలు రచ్చకెక్కాయి. ఆ పార్టీల చేరికలు వర్గపోరుకు దారితీశాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించిన మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిత్ ఖాన్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, సీనియర్ నాయకుడు సంజీవరెడ్డిలను తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. కాగా, వీరి చేరికలను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన బాటపట్టాయి.అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి కారణమైన ముగ్గురు నాయకులను చేర్చుకోవద్దంటూ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి వర్గీయులు ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ద్రోహులను పార్టీ నుంచి బహిష్కరించాలని నినదించారు. వారి చేరికలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. హైకమాండ్ నిర్ణయం మార్చుకోకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## దండకారణ్యం లో కాల్పుల మోత

రాయ్ పూర్, మే 1 ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. కాంకేర్, నారాయణ్‌పుర్ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టులు, భద్రతా సిబ్బంది మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నక్సల్స్ పెద్ద సంఖ్యలో హతమయ్యారు. 2 వారాల వ్యవధిలో ఈ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ జరగడం ఇది రెండోసారి. మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలోని తెక్‌మేట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు నక్కినట్లు పోలీసులకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో స్పెషల్ టాస్క్ ఫోర్స్, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గ్రూప్ డీఆర్‌జీ దళాలు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. గాలింపు చేస్తూ నక్సల్స్ ఉన్న ప్రాంతానికి చేరుకున్నాయి. వీరిని చూసి మావోయిస్టులు కాల్పులు జరిపారు. భద్రతా దళాల ఎదురు కాల్పుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు చనిపోయారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు.

## ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 60కిపైగా పాఠశాలలకు బాంబు బెదిరింపులు.. ఉలిక్కిపడ్డ రాజధాని ప్రాంతం

దేశంలో బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. రెండు రోజుల క్రితం దేశంలోని ప్రధాన విమానాశ్రయాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా దేశరాజధాని ఢిల్లీ లోని సుమారు 50 పాఠశాలలకు బుధవారం ఉదయం బెదిరింపులు వచ్చాయి.ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లోని పలు ప్రముఖ స్కూళ్లకు బుధవారం ఉదయం బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. రాజధానిలోని ద్వారక, వసంత్ కుంజ్, తూర్పు మయూర్ విహార్‌లోని మదర్ మేరీ స్కూల్, సంస్కృతి స్కూల్, పుష్ప విహార్‌లోని అమిటీ స్కూల్, సౌత్ వెస్ట్ ఢిల్లీలోని డీఏవీ స్కూల్స్‌కు బాంబు బెదిరింపులు వచ్చినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. అదేవిధంగా నోయిడాలోని సుమారు 12 పాఠశాలలకు




కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం 6 గంటల సమయంలో పాఠశాలలకు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపు మెయిల్స్ పంపినట్లు చెప్పారు.దీంతో అప్రమత్తమైన ఆయా పాఠశాలల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసు అధికారులు ముందు జాగ్రత్త చర్యగా పాఠశాలలోని విద్యార్థులు, సిబ్బందిని ఇంటికి పంపించేశారు. అనంతరం బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో విస్తృత తనిఖీలు చేపట్టారు. అయితే, అక్కడ ఎలాంటి పేలుడు పదార్థాలూ వారికి కనిపించలేదు. దీంతో కేసు నమోదు చేసుకొని ఈమెయిల్ ఐపీ అడ్రెస్ ద్వారా ఆగంతకులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకేసారి ఇన్నిపాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడంతో రాజధాని ఒక్కసారిగా ఉలిక్కిపడింది.మరోవైపు ఈ బాంబు బెదిరింపులపై ఢిల్లీ మంత్రి అతిషీ స్పందించారు. ఢిల్లీ పోలీసులు, పాఠశాల అధికారులతో ప్రభుత్వ అధికారులు నిరంతరం టచ్‌లో ఉన్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరూ భయపడొద్దని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ఈరోజు ఉదయం కొన్ని పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. విద్యార్థులను వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయించారు. ఆయా పాఠశాలల ప్రాంగణాల్లో ఢిల్లీ పోలీసులు సోదాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఏ పాఠశాలలోనూ ఎలాంటి పేలుడు పదార్థాలూ లభ్యం కాలేదు. మేము పోలీసులు, పాఠశాలల యాజమాన్యాలతో నిరంతరం టచ్‌లో ఉన్నాము. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు భయపడొద్దు' అని అతిషీ ఎక్స్‌లో రాసుకొచ్చారు.కాగా, దేశంలో ఇటీవలే వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ సహా చెన్నై, ముంబైలోని పలు పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ ఢిల్లీలో పలు స్కూళ్లకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. పోలీసులు తనిఖీలు చేపట్టగా ఎలాంటి పేలుడు పదార్థాలూ లభించలేదు. దీంతో అది నకిలీ బెదిరింపు అయి ఉంటుందని పోలీసులు అప్పట్లోనే వెల్లడించారు. అంతేకాదు, పలు విమానాశ్రయాలకు కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఇలా దేశంలోని పలు పాఠశాలలు, ప్రముఖ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకటి వరుస బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది.

## రిజర్వేషన్లపై కర్పూరీ ఠాకూర్‌తో విభేదిస్తున్న మోదీ : తేజస్వి యాదవ్

రిజర్వేషన్ల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీకి సమాచార లోపం ఉందని ఆర్జేడీ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ అన్నారు. ప్రధాని మోదీ కర్పూరీ ఠాకూర్‌ను భారత రత్నతో గౌరవించారని, అయితే కర్పూరీ ఠాకూర్ అభిప్రాయాలను వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు.కర్పూరీ ఠాకూర్ తొలిసారి సీఎం పదవి చేపట్టిన వెంటనే సామాజికంగా వెనుకబడిన కులాలన్నింటికీ వారి మతాలతో నిమిత్తం లేకుండా తొలిసారిగా రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. కర్పూరీ ఠాకూర్ నిర్ణయాన్ని తప్పు అని చెప్పడం సరైనదేనా అని ప్రశ్నించారు.ఇక రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, విపక్ష ఇండియా కూటమి మధ్య డైలాగ్ వార్ క్లైమాక్స్‌కు చేరింది. మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపడితే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లను రద్దు చేస్తారని కాంగ్రెస్ సహా విపక్ష నేతలు ప్రచారం సాగిస్తుండగా రిజర్వేషన్లను తొలగించే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ సహా కాషాయ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు.



## భూమి హక్కు చట్టంపై దాడి స్పందన

అనకావల్లి,భూమి హక్కు విధివిధానాలపై మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మీడియా సమావేశం నిర్వహించారు. భూ యాజమాన్య హక్కు చట్టం పై రాష్ట్ర ప్రభుత్వం, వైసీపీ నాయకులు ఎన్నికల కమిషన్ ను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ చట్టాన్ని ఆమోదిస్తూ 2023 అక్టోబర్ నెలలోనే రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 502 గా విడుదల చేసింది. ఈ చట్టంతో ప్రజలు తమ ఆస్తులపై ఉన్న హక్కును పూర్తిగా కోల్పోతారు. ప్రజల ఆస్తులను కాజేసేందుకే వైసీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చింది. ఇటువంటి చట్టాన్ని తీసుకువచ్చే తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వం ఓటమిపాలు అయింది, ఇక్కడ కూడా అదే పరిస్థితి జరుగుతుందని అన్నారు.

## ఓయో లాడ్జిలో లవర్స్

**ప్రియుడు అనుమానాస్పద మృతి**

హైదరాబాద్ ,ప్రియురాలితో కలిసి ఓయో లాడ్జీలో బస చేసిన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఎస్సార్నగర్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై శ్రావణ కుమార్ వివరాల ప్రకారం..మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన హేమంత్ (28) ఇటుకల వ్యాపారి ఆదే ప్రాంతానికి చెందిన యువతి(27)తో ఏడేళ్ల కిందట పరిచయం ఏర్పడగా.. అది ప్రేమగా మారింది. ఇద్దరూ కలిసి సోమవారం నగరంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై రాత్రి ఎస్సార్ నగర్ లోని ఓయో టౌన్ హౌస్ లో గది తీసుకొని బస చేశారుమద్యం తాగి రాత్రి 2 గంటల ప్రాంతంలో హేమంత్ బాత్రూంకు వెళ్లాడు. ఎంతకు బయటకు రాకపోవడంతో యువతి వెళ్లి చూడగా అపస్మారకస్థితిలో హేమంత్ వున్నాడు.దీంతో యువతి హేమంత్ స్నేహితులకు చెప్పడంతో వారు వచ్చి హేమంత్ ను మంచంపై పడుకోబెట్టి 108 అంబులెన్స్ కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది పరీక్షించి అప్పటికే హేమంత్ మృతి చెందినట్టు నిర్ధారించారుమృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ హేమంత్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## ప్రలోభాలకు పాల్పడుతున్న బద్వేల్ వైసీపీ నేతలు

**మెప్మా యానిమేటర్లతో రహస్య సమావేశం**

కడప బద్వెల్ వైకాపా నేతలు ప్రలోభానలకు తెర లేపారు. డ్వాక్రా సంఘాల ఓట్లు వైసీపీకి పడేలా చూడాలంటూ యానిమేటర్లకు వైసీపీ అభ్యర్థి డాక్టర్ సుధా, అడా చైర్మన్ గురు మోహన్ ఆదేశాలు ఇచ్చారు. విషయం తెలుసుకుని మీటింగ్ దగ్గరికి బిజెపి జిల్లా అధ్యక్షుడు మీటింగ్ దగ్గరికి వెళ్లిన బిజెపి జిల్లా అధ్యక్షుడు శశిభూషన్ రెడ్డి, టిడిపి బద్వేల్ పట్టణ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి వెళ్లారు. దాంతో యానిమేటర్లు ముఖానికి ముసుగులు కట్టుకొని అక్కడి నుంచి పారిపోయారు. కోడి ఉల్లంఘన పాల్పడుతున్న వైసీపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలంటు కూటమి నేతల డిమాండ్ చేసారు.

## టిడిపి పార్టీలోకి ఊపందుకుంటున్న వలసలు

రామచంద్రాపురం,ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టిడిపి పార్టీ లోనికి వలసలు జోరు అందుకుం టున్నాయి . పట్టణంనకు చెందిన ప్రముఖ వైసిపి నాయకులు చిలుకూరు వీర వెంకట సత్యనారాయణ రామకృష్ణ సోదరులు అధ్వర్యయం లోవైసిపి పార్టీని విడిచి నియోజవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి శుభాకాంక్షలు సమక్షంలో సుమారు 90 మంది వైసీపీ కార్యకర్తలు టిడిపిలో చేరారు.

# ఏపీ ఎన్నికల్లో గేమ్ ఛేంజర్ ఏదీ....

విజయవాడ, మే 1, ఏపీ ఎన్నికల్లో అధికార వైసీపీ, విపక్ష టీడీపీ కూటమి హోరాహోరీ తలపడుతున్నాయి. మరోసారి అధికారం కైవసం చేసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. పునర్వైభవం సాధించాలని టీడీపీ తహతహలాడుతున్నాయి. దీంతో అధికారమే లక్ష్యంగా హామీలు కురిపిస్తున్నాయి. వైసీపీ ఇప్పటికే ఎన్నికల మేనిఫెస్టో రిలీజ్ చేయగా.. తాజాగా మంగళవారం టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి కూడా మేనిఫెస్టో ప్రకటించింది. ఇక రెండు పార్టీల మేనిఫెస్టోలను ఓసారి పరిశీలిస్తే.. అనేక ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి.టీడీపీ, వైసీపీ మేనిఫెస్టోలో సారూప్యత కనిపిస్తున్న పథకాలు.. అమ్మ ఒడి, తల్లికి వందనం. నవరత్నాల్లో భాగంగా వైసీపీ సర్కారు పిల్లలను అమ్మ ఒడి పథకం పేరిట బడికి పంపే తల్లుల ఖాతాల్లో ఏటా 15 వేలు జమచేస్తూ వస్తోంది. వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే ఈ మొత్తాన్ని 15 వేల నుంచి 17 వేలకు పెంచుతామని జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. ఇదే తరహా హామీ టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టోలోనూ ఉంది. తల్లికి వందనం పేరుతో చంద్రబాబు దీనికి సంబంధించి హామీ ఇచ్చారు. తాము గెలిస్తే తల్లికి వందనం పేరుతో స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి 15 వేలు చొప్పున సాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.ఇక అత్యంత కీలకమైన హామీ ఏమిటంటే పింఛన్లు. ఏపీవ్యాప్తంగా ఇప్పటికే వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద వైసీపీ నెలకు మూడు వేల రూపాయల పింఛన్ అందిస్తోంది. తాము మళ్లీ అధికారంలోకి వస్తే ఈ మొత్తాన్ని రెండు దఫాల్లో నాలుగు వేలకు పెంచుతామని జగన్ ప్రకటించారు. 2028లో రూ.3500లకు, 2029 జనవరిలో రూ.4000 వేలకు పెంచుతామన్నారు. అయితే తాము అధికారంలోకి వస్తే 2024 ఏప్రిల్ నుంచే పింఛన్ మొత్తాన్ని రూ.4000 చేస్తామని టీడీపీ హామీ ఇచ్చింది. ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల పింఛన్ బకాయిలు కలిపి జూన్ నెలలోనే రూ.7000 అందిస్తామంటోంది. అలాగే దివ్యాంగులకు నెలకు ఆరువేలు పింఛన్ అందిస్తామని.. వందశాతం దివ్యాంగులు అయితే రూ. 10,000 అందిస్తామని టీడీపీ కూటమి మేనిఫెస్టోలో ప్రకటించింది.ఇక రెండు పార్టీలు ప్రకటించిన హామీల్లో సారూప్యత ఉన్న మరో అంశం కూడా ఉంది. వైఎస్ఆర్ రైతు భరోసా పథకం కింద ప్రస్తుతం ఏడాదికి రూ.13500 చొప్పున వైసీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తోంది. కేంద్రం అందించే ఆరువేలతో కలిపి ఈ మొత్తాన్ని నాలుగు విడతల్లో అందిస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో గెలిస్తే రైతు భరోసా మొత్తాన్ని ఏడాదికి రూ.16 వేలకు పెంచుతామని వైసీపీ మేనిఫెస్టోలో జగన్ హామీ ఇచ్చారు. ఇక టీడీపీ కూటమి విషయానికి వస్తే..తాము గెలిస్తే ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయంగా అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.మరోవైపు 45 నుంచి 60 ఏళ్లలోపు వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు వైఎస్ఆర్ చేయూత కింద వైసీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.18,750 సాయం అందిస్తోంది. మొత్తంగా ఐదేళ్లలో రూ.75000 ఆర్థిక సాయం అందిస్తోంది. వచ్చే ఎన్నికల్లో గెలిస్తే వైఎస్ఆర్ చేయూత పథకాన్ని కొనసాగిస్తామని వైఎస్ జగన్ 2024 మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. అయితే టీడీపీ కూటమి మాత్రం ఇందుకు కాస్త భిన్నమైన పథకాన్ని ఎంచుకుంది. వైసీపీ 45 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు ఆర్థిక సాయం అంటూ హామీ ఇస్తే టీడీపీ మాత్రం 19 నుంచి 59 ఏళ్లలోపున్న ప్రతి మహిళకు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది.ఇక వైసీపీ మూడు రాజధానుల విధానానికి కట్టుబడగా.. టీడీపీ మాత్రం అమరావతే రాజధానిగా ఉంటుందని చెబుతోంది. ఇక వైసీపీ ప్రకటించని.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను చంద్రబాబు తమ మేనిఫెస్టోలో ప్రకటించారు.

# పులివెందులలో పీక్ చేరిన పోరు

కడప, మే 1, నిన్నటి నుంచి పులివెందులలో వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. తన భర్తను మరోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు. కడప జిల్లా వ్యాప్తంగా ఆమె ప్రచారం నిర్వహిస్తారని వైసీపీ వర్గాలు వెల్లడించాయి. పులివెందులలో తన భర్త జగన్ కు మద్దతుగా ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. అది ఎప్పుడూ జరిగేదే. గత ఎన్నికల సమయంలోనూ వైఎస్ భారతి పులి వెందుల నియోజకవర్గంలో మాత్రమే పర్యటించి తన భర్త జగన్ ను గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ప్రజలను కోరారు. ఆమె గత ఎన్నికల్లో పులివెందుల నియోజకవార్గానికే పరిమితమయ్యారు.కానీ ఈసారి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఆమె పర్యటించి కార్నర్ మీటింగ్ లలో పాల్గొంటారని పార్టీ వర్గాలు చెప్పాయి. అంటే కడపపార్లమెంటుఎన్నికల్లోవైసీపీని గెలపించేందుకు ప్రచారం నిర్వహిస్తున్నట్లవుతుంది. అయితే ఇక్కడ ఒక విషయం ఏంటంటే.. కడప పార్లమెంటు పరిధిలో వైఎస్ అవినాష్ రెడ్డి వైసీపీ నుంచి పోటీ చే?స్తుండగా, కాంగ్రెస్ నుంచి వైఎస్ షర్మిల పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. తన ఆడబిడ్డ ఓటమికి వైఎస్ భారతి నేరుగా రంగంలోకి దిగినట్లయింది. వైఎస్ షర్మిలను ఓడించాలని నేరుగా ఆమె చెప్పకపోయినా.. వైసీపీ ఎంపీ అభ్యర్థి అవినాష్ రెడ్డికి ఓటు వేయమంటే వైఎస్ షర్మిలను ఓడించమన్నట్లే కదా? అన్న కామెంట్స్ వినపడుతున్నాయి.కడప నియోజకవర్గంలో వైఎస్ కుటుంబంలో చీలిక వచ్చిన నేపథ్యంలో వైఎస్ భారతి ఎంట్రీ చర్చకు దారి తీసింది. ఒకవైపు వైఎస్ షర్మిల, వైఎస్ సునీత కాంగ్రెస్ తరుపున ప్రచారం చేస్తుంటే వైఎస్ భారతి మాత్రం తన భర్తను గెలపించాలని, వైసీపీ అభ్యర్థులకు మద్దతివ్వాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇది చూసేవారికి కొంత ఆశ్చర్యంగా కనిపిస్తున్నా.. వైఎస్ భారతిని ఆప్యాయంగా పలకరిస్తూ పులివెందుల ప్రజలు తమ ఇంట్లోకి రావాలని ఆహ్వానిస్తున్నారు. షర్మిల పేరు నేరుగా ప్రస్తావించకపోయినా అవినాష్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ ముందుకు వెళుతున్నారు. పులివెందుల ప్రజలు ఈ కుటుంబసభ్యుల రాజకీయాలను ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈసారి పులివెందులలో జగన్ కు లక్షకు పైగా మెజారిటీ వస్తుందని తెలిపారు. ఇక్కడి ప్రజలు జగన్ ను మరోసారి అత్యధిక మెజారిటీతో ఆదరిస్తారన్న నమ్మకం తనకు ఉందని అన్నారు. జగన్ అమలు చేస్తున్న పథకాలకు మంచి ఆదరణ లభించిందన్నారు. వైఎస్ కుటుంబానికి పులివెందుల ఎప్పుడూ అండగా ఉంటుందని ఆమె అన్నారు. పులివెందులకు వైఎస్ కుటుంబం.. వైఎస్ కుటుంబానికి పులి వెందుల ఒక భరోసా అని వైఎస్ భారతి కామెంట్ చేశారు. ఈసారి కూడా జగన్ అధికారంలోకి రావడం ఖాయమన్న వైఎస్ భారతి చంద్రబాబును ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. జగన్ పేదల పక్షపాతిగా ఉండి పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని చెప్పారు. మొత్తం మీద పులివెందుల గడ్డ మీద ఆడబిడ్డతో వైఎస్ భారతి ఢీ అంటే ఢీ అంటున్నారు.

# కూటమిపై గాజు గ్లాసు ఎఫెక్ట్...

విజయవాడ, మే 1, న్నికలు అన్నాక వ్యూహాలు ఉంటాయి. ప్రతి వ్యూహాలు ఉంటాయి. నేరుగా ప్రజల మద్దతు కాదు. మరెన్నో అంశాలు ఎన్నికల్లో గెలుపోటములను ప్రభావితం చేస్తాయి. వాటిని పరిగణలోకి తీసుకోకపోతే ఆ రాజకీయ పార్టీలు మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇప్పుడు జనసేన తప్పిదంతో.. కూటమి మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. రాజకీయం అంటేనే కుట్రలు, కుతంత్రాలు ఉంటాయి. తాము గెలవాలంటే కచ్చితంగా ప్రత్యర్థి ఓడిపోవాలి. దానికి ఒక్క ప్రజల మద్దతే కాదు. ఓట్లను అడ్డగోలుగా చీల్చాలి. తప్పుడు ప్రచారాలు చేయాలి. ఇటువంటి వాటిని ఎదుర్కొని నిలబడే వారే గెలుపును అందుకోగలరు. అయితే పరిస్థితి చేయి దాటాక గగ్గోలు పెడితే లాభం ఉండదు.ఇప్పుడు ఏపీలో జనసేన చేస్తున్నది ఇదే.



గాజు గ్లాస్ గుర్తు విషయంలో చేజేతులా మీదకు తెచ్చుకున్నది జనసేన.ఎలక్షన్ కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈసీ వెబ్సైట్లో ఫ్రీ సింబల్స్ జాబితాను విడుదల చేసింది. అందులో గాజు గ్లాసు గుర్తు స్పష్టంగా కనిపిస్తోంది. జనసేన పార్టీకి గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేయడం ఖాయం. కానీ గుర్తింపు లేదు ఆ పార్టీకి. అందుకే కామన్ సింబల్ కేటాయించలేదు. అయితే రాజకీయ పార్టీల ప్రత్యేక వినతులకు ఈసీ స్పందిస్తుంది. కానీ ఎందుకో జనసేన వినతిని ఈసీ పరిగణలోకి తీసుకోలేదు.అయితే ఈ విషయంలో కూటమి పార్టీలు సైతం ఉదాసీనంగా వ్యవహరించడం మాత్రం తగదు. గుర్తులు కేటాయించే వరకు ఫ్రీ సింబల్స్ లో గ్లాస్ ఉందని తెలిసి కూడా.. ఈసీ వద్దకు వెళ్లి తమ అభ్యంతరాలు వ్యక్తం చేయలేకపోయారు. అది వైసీపీకి కలిసి వచ్చింది. కూటమి రెబల్స్ తో పాటు వైసిపి డమ్మీ అభ్యర్థులకు గాజు గ్లాస్ గుర్తు దక్కింది.గుర్తుల విషయంలో రాజకీయ పార్టీలు అప్రమత్తంగా ఉండాలి.ఫ్యాన్ గుర్తును పోలి ఉండేలా గుర్తు ఏదైనా ఉంటే వైసీపీ నుంచి అభ్యంతరం వ్యక్తం కావడం ఖాయం. సైకిల్ గుర్తును పోలి ఉండేలా ఏదైనా గుర్తింపు ఉంటే దాన్ని ఇండిపెండెంట్ లకు కేటాయించవద్దని టిడిపి కోరుతుంది. కానీ జనసేన విషయానికి వచ్చేసరికి మాత్రం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు కూటమి నేతలు గగ్గోలు పెట్టడం తప్ప ఏమి చేయలేకపోయారు. ఫ్రీ సింబల్స్ కేటగిరీలు గాజు గ్లాసు గుర్తు ఉంది కాబట్టి తాము కేటాయించినట్లు ఎన్నికల అధికారులు చెబుతున్నారు. అయితే అదే సమయంలో గాజు గ్లాసు గుర్తుతో తమకు పెద్దగా నష్టం ఉండదని కూటమి అభ్యర్థులు లైట్ తీసుకుంటే ఇబ్బందికర పరిణామాలు తప్పవు. మొన్నటి తెలంగాణ ఎన్నికల్లో గాజు గ్లాసు గుర్తు దక్కించుకున్న పార్టీలు వేల ఓట్లు దక్కించుకున్నాయి. వారికి తమ కుటుంబ సభ్యులు తప్ప ఎవరూ ఓటు వేయరు అన్న రీతిలో ఉండేది అక్కడ పరిస్థితి. కానీ గాజు గ్లాస్ గుర్తు దక్కించుకోవడంతో వేల ఓట్లు సాధించారు. తమకు తామే ఆశ్చర్యానికి గురయ్యారు. ఇప్పుడు అదే పరిస్థితి ఏపీలో ఉంటుంది. వందల మెజారిటీ ఉన్నచోట్ల వైసిపికి ప్రయోజనం చేకూర్చనుంది. అయితే గాజు గ్లాసు గుర్తు విషయంలో జనసేన ఉదాసీనత కూటమికి ఇబ్బందికరంగా మారింది.

# చేవెళ్లలో సినీ సాహితికి గ్లాసు...

హైదరాబాద్, మే 1 ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల వేడి రాజుకుంది. భానుడు భగ భగ మండుతున్నప్పటికీ, అభ్యర్థులు జోరుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఊరూ వాడా తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. తెలంగాణతో పాటు ఆంధ్ర ప్రదేశ్ లోనూ పలువురు సినీ తారలు ఎన్నికల బరిలో నిలిచారు. అసెంబ్లీతో పాటు పార్లమెంట్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. పవర్ స్టార్ పవన్ కల్యాణ్, నటసింహం నందమూరి బాలకృష్ణ, నటి రోజా ఎన్నికల సంగ్రామంలోకి దిగారు. ఈ ముగ్గురు అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీకి దిగారు. ఇక తెలంగాణలోనూ ఓ సినీ నటి లోక్ సభ ఎన్నికల బరిలో నిలిచింది. ఆమె మరెరో కాదు నటి సాహితీ దాసరి.'మా ఊరి పొలిమెర', 'పొలిమెర 2' సినిమాల్లో కీలక పాత్ర పోషించింది సాహితీ దాసరి. ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగింది. ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసింది. ఆమె నామినేషన్ ను ఎన్నికల అధికారులు యాక్సెప్ట్ చేశారు. 29 ఏండ్ల సాహితీకి గాజు గ్లాస్ గుర్తును కేటాయించారు.

ఈ విషయాన్ని సాహితి సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. తనకు ఈసీ గాజు గ్లాస్ కేటాయించినట్లు వెల్లడించింది. అందరూ తనకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేసింది. అయితే, గాజు గ్లాస్ సింబల్ ను చూసి చాలా మంది కన్ఫ్యూజ్ అవుతున్నారు. ఆమె జనసేన నుంచి బరిలోకి దిగుతున్నారా? అని అపోహపడుతున్నారు. అయితే, తాను ఇండిపెండెంట్ అభ్యర్థిగానే బరిలోకి దిగినట్లు తెలిపింది సాహితీ. ఈ గాజు గ్లాస్ గుర్తు ఆమెకు కలిసి వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## వేగంగా రామాయపట్నంపోర్టు పనులు

ఒంగోలు, మే 1 సముద్ర తీరంలో సంపద సృష్టించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సముద్ర తీరంలో లాజిస్టిక్స్ ఎగుమతుల, దిగుమతుల పనులు సులువు చేసేందుకు .. తీర ప్రాంతాలలో.. కొత్త పోర్టులు, హార్బర్లు నిర్మాణ పనులను చేపట్టింది.. ఇలా తీర ప్రాంతాలలో పోర్టులు నిర్మించడం ద్వారా .. రాష్ట్ర అభివృద్ధితో పాటు ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నారు ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నో ఉపాధి కార్యక్రమాలను చెప్పట్టారు. ఈ క్రమంలోనే దేశంలో ఎక్కడ లేని విధంగా సుమారు రూ.20,000 వేల కోట్లతో కోస్తా తీరాన్ని అభివృద్ధి చేస్తోంది ఏపీ సర్కార్. అందుకోసం ఒకేసారి రాష్ట్రంలో.. గ్రీన్ ఫీల్డ్ పోర్టులతో పాటు.. 10 మినీ పోర్టుల రూపంలో షిప్పింగ్ హార్బర్స్ ను కూడా అభివృద్ధి చేస్తూ.. రాష్ట్ర ఆర్థిక ప్రగతిని పెంచుతోంది.ఈ క్రమంలో రాష్ట్రంలోని 974 కి.మీ సుదీర్ఘ ప్రాంతంలో ప్రతి 50 కి.మీ కు ఒక పోర్టును లేదా ఒక షిప్పింగ్ హార్బర్ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే విశాఖలో ఉన్న మేజర్ పోర్టులతో పాటు.. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులను కూడా.. అభివృద్ధి చేస్తోంది. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం రామాయపట్నం పోర్టు పనులు ప్రారంభించారు. అనుకున్న విధంగా కేవలం 18 నెలలోనే ఈ పోర్టును సిద్ధం చేసి చూపించారు. ప్రస్తుతం రామాయపట్నం పోర్టు ఫేస్-1 పనులు పూర్తయ్యాయి. ఇక రామాయపట్నం పోర్ట్ దాదాపుగా వాణిజ్యపరంగా.. కార్య కలాపాలు ప్రారంభించడానికి సర్వం సిద్ధం అయినట్లే. కేవలం 18 నెలలలోనే ఈ పోర్ట్ పనులు పూర్తి చేసి చూపించారంటే.. రాష్ట్ర వ్యాప్తంగా సాగే పనులన్నీ కూడా ఎంత వేగంగా కొనసాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.ఇక రామాయపట్నం పోర్టు విషయానికొస్తే.. ఈ పోర్టు సుమారు 850 ఎకరాల విస్తీర్ణంలో.. రూ. 4,902 కోట్ల పెట్టుబడితో ఈ పోర్టును అభివృద్ధి చేశారు. 2022 జూన్ లో ఈ పోర్ట్ నిర్మించేందుకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మొదటి దశలో.. 34.04 మిలియన్ మెట్రిక్ టన్స్ పర్ ఆనమ్ సామర్థ్యంతో.. ఫేస్-1లో నాలుగు బెర్తులు అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో ఇప్పటికే అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, సెంట్రల్ ఎక్సైజ్ , కస్టమ్స్ బిల్డింగ్ పనులు కూడా పూర్తవడంతో.. త్వరలోనే తొలి నౌకను తీసుకువచ్చి.. వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నారు అధికారులు. భారీ ఓడలను తీరానికి సురక్షితంగా తీసుకుని వచ్చేలా .. 7.87 మిలియన్ క్యూబిక్ మీటర్ల డ్రెడ్జింగ్ , టర్నింగ్ సర్కిల్స్, అప్రోచ్ ఛానల్ ను నిర్మించారు. అనుకున్న విధంగా కేవలం 18 నెలలలోనే రామాయపట్నం పోర్టు ఫేస్-1 పూర్తి చేసి చూపించారు. ఇక అతి త్వరలోనే ఈ పోర్టుకు సంబంధించిన మిగిలిన పనులను కూడా .. వేగంగా పూర్తి చేసేందుకు సిద్ధం అవుతున్నారు

# లెక్క తేలింది...

విజయవాడ, మే 1, ఏపీలో ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. ఈ మేరకు సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం విడుదల చేసింది. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత లోక్ సభ ఎన్నికల బరిలో 454 మంది అభ్యర్థులు, 175 అసెంబ్లీ స్థానాలకు 2,387 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఈసీ ప్రకటించింది. అత్యధికంగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 46 మంది బరిలో ఉన్నారు. అనకాపల్లి జిల్లా చోడవరం అసెంబ్లీ నుంచి అత్యల్పంగా ఆరుగురు పోటీలో నిలిచినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అసెంబ్లీకి సంబంధించి 318 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. పులివెందుల నియోజకవర్గంలో సీఎం జగన్ సహా 27 మంది బరిలో ఉన్నట్లు ఈసీ తెలిపింది. కుప్పం నుంచి చంద్రబాబు సహా 13 మంది, మంగళగిరిలో నారా లోకేశ్ సహా 40 మంది ఎన్నికల బరిలో నిలిచారు. అటు, పిఠాపురం అసెంబ్లీ బరిలో జనసేనాని పవన్ కల్యాణ్ సహా 13 మంది పోటీ చేస్తున్నారు. ఇక లోక్ సభ ఎన్నికల విషయానికొస్తే మొత్తం 454 మంది అభ్యర్థులు బరిలో నిలవగా కడప లోక్ సభకు ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల సహా 14 మంది బరిలో నిలిచారు. అలాగే, నంద్యాలలో 31, గుంటూరులో 30 మంది పోటీలో ఉన్నారు. కాగా, ఇప్పటికే ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు మునిగి తేలుతున్నారు. అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మే 13న పోలింగ్ జరగనుంది.

## ముత్యాలనాయుడికి ఇంటిపోరు

కాకినాడ, మే 1, ఎన్నికల వేళ వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడికి ఇంటిపోరు తప్పడం లేదు. ముత్యాల నాయుడు కుమారుడు రవికుమార్ మాడుగుల నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.. అదే స్థానం నుంచి ముత్యాల నాయుడు కుమార్తె అనురాధ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. దీంతో అనకాపల్లి జిల్లాలో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. మాడుగులలో స్వతంత్ర అభ్యర్థిగా ఉన్న ముత్యాల నాయుడు కుమారుడు రవికుమార్ తండ్రికి మరో షాకిచ్చారు.ఈసారి రేకంగా తన తండ్రిని ఓడించండి అంటూ బూడి రవికుమార్ ప్రచారం చేస్తున్నారు. మంగళవారం ఆయన సోషల్ మీడియాలో విడుదల చేసిన ఓ పోస్టర్ కలకలంరేపుతోంది. 'కన్న కొడుకుకు న్యాయం చేయలేనివారు ఓటేసిన ప్రజలకు ఏం న్యాయం చేయగలరు? ఆలోచించి ఓటు వేయండి. మా నాన్న బూడి ముత్యాలనాయుడిని ఓడించండి' అని ఆ పోస్టర్‌లో పేర్కొన్నారు. జిల్లాలో ఈ ఫోటో వైరల్ అవుతోంది.బూడి ముత్యాల నాయుడు అనకాపల్లి జిల్లా మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఆయన డిప్యూటీ సీఎంగా ఉన్నారు.. అయితే ఆయనకు ముందు మాడుగుల టికెట్ ప్రకటించారు. ఆ తర్వాత మళ్లీ ఆయన్ను ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించారు. దీంతో మాడుగుల స్థానం ఆయన రెండో భార్య కుమార్తె అనురాధకు కేటాయించారు. దీనిపై ఆయన మొదటి భార్య కుమారుడు రవి ఆగ్రహంగా ఉన్నారు. రవి గతంలో జడ్పీటీసీ సభ్యుడిగా పోటీచేయడానికి నామినేషన్ వేస్తే విత్‌డ్రా చేసుకునేలా చేసి.. అప్పుడూ అనురాధనే పోటీ చేయించారు.అప్పటినుంచి రవి తండ్రి తీరుపై అసంతృప్తితో ఉన్నారు. ఇప్పుడూ.. బూడి కుమార్తె వైపే మొగ్గుచూపడంతో రవి తన సోదరిపైనే స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తానని ప్రకటించారు. 'మా నాన్న తులసి మొక్క. 2019 తర్వాత ఆ మొక్కకి కొన్ని పురుగులు పట్టాయి. జగన్‌ని నమ్ముకొని 9 ఏళ్లు ఆయన వెంట తిరిగాను. ఏనాడూ ముత్యాలనాయుడి కుమారుడిగా పార్టీలో తిరగలేదు.

## పెన్షన్ ఓటర్ల స్లిప్పుల పంపిణీని వేగవంతం చేయండి

### నిరంజన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 01- ప్రజలకు పెన్షన్ ఓటర్ స్లిప్పుల పంపిణీని వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు . బుధవారం పట్టణంలో ఎస్ బీ ఐ కాలనీ. టెక్కే. నడిగడ్డ. జగజ్జనని నగర్. పరుక్ నగర్. బాల్కొండ హాల్ . పరిధిలో ఓటర్ స్లిప్ లు పింఛన్ల పంపిణీ చేస్తున్న కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఇంటింటికి ఓటర్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. స్లిప్‌ల పంపిణీలో అలసత్వం లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఓటు హక్కును ప్రతి ఓటర్ సద్వినియోగం చేసుకొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ముందస్తు పన్ను 7 కోట్ల 67 లక్షల 50 వేలు వసూలు

### నిరంజన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 01- పట్టణ ప్రజల నుంచి ఏప్రిల్ 1 వ తేదీ నుంచి 30 వతేది వరకు ఇంటి పన్ను కుళాయిపన్ను. ఖాళీ స్థలాల పన్నులు రాయితీ తో కూడిన ముందస్తు పన్నుల రూపంలో నంద్యాల మున్సిపాలిటీ కి 7 కోట్ల. 67 లక్షల. 50 వేలు వసూలు అయిందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. కమిషనర్ బుధవారం మున్సిపల్ కార్యాలయం లో మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-2025) సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి మొత్తం పన్ను పై 5 శాతం రాయితీ రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 50 లక్షలు పెరిగిందన్నారు. పట్టణ ప్రజలు ముందస్తు పన్ను చెల్లించినందుకు పట్టణం సుందరంగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు.


## సరిహద్దు చెక్ పోస్ట్ లలో అప్రమత్తంగా విధులు నిర్వహించండి

### జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. కె. శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 01-జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ ల వద్ద అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. కె. శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం పట్టణ శివారు ప్రాంతాలలోని అయ్యలూరి మెట్ట, గాజులపల్లి మెట్ట క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసారు. తనిఖీలు చేసి వాహనాలను నమోదు చేసిన రిజిస్టర్ ను పరిశీలించారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసి అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం వుంటే సంబంధిత అధికారులు లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు. చెక్ పోస్ట్ ల వద్ద నిత్యం అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు.

# 24వ వార్డు సాయిబాబ నగర్ నుండి టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు భారతి రెడ్డి మరియు 50 కుటుంబాలు వైసీపీలో చేరిక...



నంద్యాల పట్టణం 24వ వార్డు సాయిబాబ నగర్ నుండి టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు భారతిరెడ్డి మరియు 50 కుటుంబాలు వైఎస్సార్సీపీ నాయకుడు ఆ వార్డు ఇంచార్జి షేక్ రహంతుల్లా ఆద్వర్యంలో మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్ష్యంలో వైసీపీలో చేరడం జరిగింది. వీరందరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా నంద్యాలలో ఎగురవేయడానికి వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి విజయానికి కృషిచేయాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ....వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన ప్రజా సంక్షేమ పరిపాలన అభివృద్ధికి ఆకర్షితులైన వీరంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో చేరడం సంతోషంగా ఉందన్నారు. అంతే కాకుండా నంద్యాల ప్రజలకు ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి చేసిన సేవా కార్యక్రమాలు, నంద్యాల పట్టణ అభివృద్ధి శరవేగంగా చేపట్టారని, మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో చేరిన వారందరు నేటి నుండి శిల్పా కుటుంబ సభ్యులని, ఎన్నికలకు కేవలం కొద్ది రోజుల వ్యవధి మాత్రమే ఉందని, ప్రతి ఒక్కరు తమ శక్తివంచనలేకుండా వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారు చిరంజీవి, ఓబులేసు, హుసేన్ రెడ్డి, మరియు 50 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు.

# ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కాదు, జగన్ రెడ్డి ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్

### నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 01-ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దగాపడిన ప్రతీ ఒక్కరికీ స్వాంతన ఇచ్చేలా కూటమి మ్యానిఫెస్టో ఉందని, యువతీ యువకుల కలలను సాకారం చేసేలా మ్యానిఫెస్టో రూపొందించిన ఘనత కూటమి పార్టీలకే దక్కిందని నంద్యాల లోక్ సభ టీడీపీ అభ్యర్థి డాక్టర్ . బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ . బైరెడ్డి శబరి ఎన్నికల కార్యా లయంలో ఆమె పత్రిక ప్రకటన విడు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా తొలి సంతకం మెగా డీఎస్సీపై చేయను న్నారని, యువతకు ఉద్యోగాల కల్పన మాత్రమే కాకుండా నిరుద్యో గులకు భృతిని కూడా అందిస్తుందన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలకు ప్రజల నుంచి మంచి రెస్పాన్స్ ఉందని, 10 శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల అమలుకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని, మ్యానిఫెస్టో ద్వారా మరోసారి చెప్పామన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాయలసీమ లోని ప్రతీ ఇంటికీ ఉచిత కుళాయి కనెక్షన్ ఇచ్చి సీమ ప్రజల దాహార్తి తీరుస్తామని, డ్వాక్రా అక్కచెల్లెళ్లకు రూ. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామన్నారు. సముద్ర వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ. 20 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు బోటు మరమ్మతులకు ఆర్థికసాయం అందించేందుకు టీడీపీ పార్టీ కట్టుబడి ఉందని. జగన్ మోహన్ రెడ్డి తీసుకుని వచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామన్నారు, ఇది ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కాదని , జగన్ రెడ్డి ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ అని ఆమె ఆరోపించారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ను స్థాపించేందుకు రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల ఆరోగ్య బీమాను తీసుకుని వస్తున్నామని డాక్టర్ . బైరెడ్డి శబరి వివరించారు.

# రెండు బ్యాలెట్ యూనిట్లు ఏ విధంగా కనెక్ట్ చేయాలనే దాని మీద ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా జి.సృజన



కర్నూలు, మే 01:- రెండు బ్యాలెట్ యూనిట్లు ఏ విధంగా కనెక్ట్ చేయాలనే దాని మీద ప్రత్యేక శ్రద్ధ వహించి నేర్చుకోవాలని శిక్షణకు హాజరైన పిఓ, ఎపిఓ లకు జిల్లా ఎన్నికల అధికారి/ జిల్లా కలెక్టర్ డా జి.సృజన తెలియచేశారు. బుధవారం మంత్రాలయం మండల కేంద్రంలోని టిటిడి కళ్యాణ మండపంలో, ఆలూరు మండల కేంద్రంలోని ఏపి మోడల్ స్కూల్ లో సాధారణ ఎన్నికలు -2024 నిర్వహణ పై మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గ స్థాయి పిఓలు, ఏపిఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పిఓ, ఎపిఓ లకు పలుమార్లు శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగిందని, కానీ ఇప్పుడు ఉన్న పరిస్థితుల ప్రకారం కర్నూలు పార్లమెంట్ కి సంబంధించి రెండు బ్యాలెట్ యూనిట్లు రానున్నాయని, గతంలో జరిగిన శిక్షణ తరగతులలో రెండు బ్యాలెట్ యూనిట్లు ఏ విధంగా కనెక్ట్ చేయాలనే శిక్షణ ఇవ్వలేదని అందుకు గాను ఈరోజు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ముఖ్యంగా రెండు బ్యాలెట్ యూనిట్లు ఏ విధంగా కనెక్ట్ చేయాలనే అంశం మీద శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, అందుకు గాను శిక్షణ కార్యక్రమంలో హాజరైన ప్రతి ఒక పిఓ, ఎపిఓ లు రెండు బ్యాలెట్ యూనిట్లు ఏ విధంగా కనెక్ట్ చేయాలనే దాని మీద ప్రత్యేక శ్రద్ధ సారించి ఏ విధంగా కనెక్ట్ చేయాలో తెలుసుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎంత శ్రద్ధ వహించి నేర్చుకోగలిగితే పోలింగ్ రోజున ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా పోలింగ్ చేయగలరన్నారు... 17 సి, పిఓ డైరీ లు ఏ విధంగా పూరించాలనే దాని మీద అవగాహన కలిగి ఉండాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ కి సంబంధించిన మాక్ పోల్ ను నిర్వహించి ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు గాను ఈరోజు శిక్షణ కార్యక్రమంలో మాక్ పోల్ ఏ విధంగా చేయాలి, డిలీట్ ఏ విధంగా చేయాలి, మాక్ పోల్ సర్టిఫికేట్ ఏ విధంగా రాయాలనే దాని మీద ప్రాక్టీస్ చేసి మాక్ పోల్ చేయుటకు ఎంత సమయం ఎ ్ ఢ ్ ు త ్ ు ం దో చ ూ న ు కో వా ల న్నా ర ు. పార్లమెంట్ కు 2 బ్యాలెట్ యూనిట్లు, 1 కంట్రోల్ యూనిట్, 1 వి వి ప్యాట్ ఉంటుందన్నారు. థంబ్ రూల్ ప్రకారం కంట్రోల్ యూనిటైన, బ్యాలెట్ యూనిటైన ముందుగా వివి ప్యాట్ కి కనెక్ట్ చేయాలని, అందులో మరి ముఖ్యంగా బ్యాలెట్ యూనిట్ థంబ్ వీల్ పైన కుడి వైపు కార్నర్ కి 1,2 నెంబర్లను చూసుకొని రెండవ బ్యాలెట్ యూనిట్ ని మొదటి బ్యాలెట్ యూనిట్ కి కనెక్ట్ చేయాలని, మొదటి బ్యాలెట్ యూనిట్ ను వివి ప్యాట్ కి కనెక్ట్ చేయాలని, వివి ప్యాట్ ను కంట్రోల్ యూనిట్ కి కనెక్ట్ చేయాలన్నారు. రెండవ బ్యాలెట్ యూనిట్ ని మాత్రం వి వి ప్యాట్ కి కనెక్ట్ చేయకుండా చూసుకోవాలన్నారు. రెండవ బ్యాలెట్ యూనిట్ , మొదటి బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్, కంట్రోల్ యూనిట్ అనే సీరీస్ లో సమకూర్చుకోవాలన్నారు. స్లీపింగ్ పోసిషన్ లో ఉండే వివి ప్యాట్ స్టాండింగ్ పోసిషన్ లోకి తీసుకొని రావాల్సి ఉంటుందన్నారు. తదనంతరం కంట్రోల్ యూనిట్ ను ఆన్ చేయాలని ఈ విధంగా రెండు బ్యాలెట్ యూనిట్లు ఏ విధంగా కనెక్ట్ చేయాలనే వివరాలను కలెక్టర్ శిక్షణకు హాజరైన పిఓ, ఎపిఓ లకు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, మంత్రాలయం రిటర్నింగ్ అధికారి మురళి, ఆలూరు రిటర్నింగ్ అధికారి రాము నాయక్, పిఓలు, ఏపిఓలు తదితరులు పాల్గొన్నారు..

## నంద్యాల టిడిపి పార్టీలో అందరూ కలిసారు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 01- బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నంద్యాల మండలం భీమవరం గ్రామంలో టిడిపి అభ్యర్థి ఫరూక్ ఎన్నికల ప్రచారం ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి టిడిపి రాష్ట్ర కార్యదర్శి తులసి రెడ్డి భీమవరం గ్రామ నాయకులు వెంకటేష్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి జనార్దన్ రెడ్డి వహాబు మాజీ ఎంపిటిసి సుభాని నాగరాజు ఈ సందర్భంగా ఫరూక్ మరియు బ్రహ్మానందరెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తుకు తెలుగుదేశం పార్టీ విజయం ఎంతో అవసరమని పెన్షన్ దారులకు 4000 అలాగే సంవత్సరానికి మూడు చొప్పున ఐదు సంవత్సరాలు 15 గ్యాస్ సిలిండర్లు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం భూమి హక్కు చట్టం రద్దు మెగా డీఎస్సీ పై తొలి సంతకం చంద్రబాబు చేస్తారని తెలిపారు.

## ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించండి

### నంద్యాల బిజెపి పార్లమెంట్ కోఆర్డినేటర్ అభిరుచి మదు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 01- ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని నంద్యాల బిజెపి పార్లమెంటరీ కో ఆర్డినేటర్ అభిరుచి మదు పేర్కొన్నారు. అభిరుచి మధు బుధవారం కోవెలకుంట్ల లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. టీడీపీ అభ్యర్థి బీసి జనార్ధన్ రెడ్డి, బీజేపీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అభిరుచి మధు, జనసేన నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం కోవెలకుంట్ల బలిజ సంఘం నాయకులూ అద్వకేట్ మురళీ ఆధ్వర్యంలో జనసేన లో చేరారు . మూడు పార్టీల ఉమ్మడి లక్ష్యం ఎన్డీఏ అభ్యర్థి ని గెలిపించడం కోసం పని చేయాలని సూచించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**